క్లుప్తంగా...

నాగారంలో అభివృద్ధి పనులు షురూ



నాగారంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో పార్కుకు ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ నిధులను వెచ్చించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ లావణ్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికానర్సింహరెడ్డి కౌన్సిలర్ భవానీరాఘవేందర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. వార్డు పరిధిలోని గడి మైసమ్మ ఆలయం ఆవరణలో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. వార్డు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని అన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఇద్దరి రాజీనామా



రాజీనామా లేఖ ప్రదర్శిస్తున్న వీరేందర్‌యాదవ్, రవీందర్

ఘట్‌కేసర్: అధికార బీఆర్‌ఎస్‌కు బుధవారం మరో షాక్ తగిలింది. బీసీ సెల్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేందర్‌యాదవ్, బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ కార్యనిర్వాహక కార్యదర్శి రవీందర్ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. అనంతరం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా రైల్వే వంతెన పనులు పూర్తికాకపోవడం, వంతెన పనులపై మంత్రి మల్లారెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో రాజీనామా చేశామన్నారు. వంతెన పనుల్లో భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహిళలు స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలి



శిక్షణకేంద్రం ప్రారంభంలో మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: మహిళలు స్వయం ఉపాధిని ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఎన్‌ఏసీ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఆధ్వర్యంలో శామీర్‌పేటలోని రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని అర్హత కలిగిన 90 మంది మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



లక్కీరాము(ఫైల్)

మేడ్చల్‌రూరల్: దుకాణానికి వెళ్లిన వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన లక్కీరాము(50) గుండ్లపోచంపల్లిలో నివాసం ఉంటూ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి తినుబండారాలు కొనుగోలు చేసేందుకు ప్రధాన కూడలిలో ఉన్న బిజయ్‌లక్ష్మి స్వీట్ హౌస్‌కు వచ్చాడు. అక్కడ రేకులషెడ్ పైపులను పట్టుకున్నారు. సాయంత్రం వర్షం కురవడంతో కరెంట్ సరఫరా అయ్యి అతడు కుప్పకూలాడు. అతడిని రక్షించేందుకు యజమాని యత్నించగా అతడికీ షాక్ తగలడంతో భయంతో షాపును వదిలి వెళ్లిపోయాడు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఆహారం..ఆరోగ్యం

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన భోజనం

- ఉదయం పూట విద్యార్థులకు రాగిజావ
- మధ్యాహ్న భోజనంలోనూ ఆకు కూరలు
- ఇష్టంగా తినేలా వెజిటెబుల్ బిర్యానీ
- పోషకాహార లోపం అధిగమించడమే లక్ష్యం



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులు పోషకాహార లోపంతో బాధపడొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగిజావ అందించేందుకు నిర్ణయించింది. ఇప్పటికే మధ్యాహ్న భోజన మెనూలో వెజిటబుల్ బిర్యానీని చేర్చగా, ఉదయం రాగిజావ అందించేలా చర్యలు చేపట్టింది. చాలామంది పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుండగా ఉదయం వచ్చే సమయంలో ఖాళీ కడుపుతో వస్తున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు అల్పాహారం తీసుకోవడంలేదు. ఫలితంగా రక్తహీనత ,పోషకాహార లోపం కనిపించడంతోపాటు తరగతి గదుల్లో నీరసంగా, అనాసక్తిగా కనిపిస్తున్నారు. ఈ సమస్యను నివారించేందుకు ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించాలని ప్రభుత్వం సంకల్పించింది. దశాబ్ది ఉత్సవాల్లో మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లా మంత్రి మల్లారెడ్డి ప్రకటించారు. దీనికి అనుగుణంగా జిల్లాలోని 505 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 90 వేల మంది విద్యార్థులకు రాగిజావ అందించేలా కార్యాచరణ రూపొందించారు. అలాగే, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని 1,932 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే 2.73 లక్షల విద్యార్థులకు కూడా రాగిజాగి అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

మధ్యాహ్న భోజనం మెనూలోనూ మార్పులు..

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. ప్రస్తుతం పిల్లలకు వారానికి మూడుసార్లు గుడ్డు అందజేస్తుండగా, కూరలతో అన్నం వడ్డిస్తున్నారు. ఇక మీదట గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో పలు పాఠశాలల్లో కొత్త మెనూ అమలు చేయడంతో పాటు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సరకులను సరఫరా చేయనున్నట్లు పేర్కొంటున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు.

మార్పునకు నాంది..

గత విద్యాసంవత్సరంలో అమలైన మెనూలో పలు మార్పులు చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వారంలో ఒక రోజు వెజిటబుల్ కర్రీ అందించనున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (1–5 తరగతులు) పిల్లలకు అన్నం వండి పెట్టినందుకు రోజుకు ఒక్కో విద్యార్థికి రూ.5.45, ఉన్నత పాఠశాల(6–10 తరగతులు) విద్యార్థులకు రూ.8.17 చొప్పున కూరగాయలు, ఇతర ఖర్చులకు చెల్లిస్తున్నారు. కొత్త విధానం అమలుతో గ్రేటర్‌తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మూడున్నర లక్షలకు పైగా విద్యార్థులకు మేలు జరగనుంది. పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తే ఆరోగ్యానికి దోహదపడుతుంది. కేంద్రం ప్రభుత్వం కొత్త విధానాన్ని నిర్దేశించడం బాగుందని, దీన్ని సక్రమంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా పేరు	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్-మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139

నూతన మెనూ ఇలా..

సోమవారం – కిచిడీ, గుడ్డు.
మంగళవారం – అన్నం, సాంబారు.
బుధవారం– అన్నం, ఆకుకూరపప్పు, గుడ్డు.
గురువారం – వెజిటబుల్ బిర్యానీ.
శుక్ర, శని – అన్నం, ఆకుకూర పప్పు.

హైదరాబాద్‌తో పాటు శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఇలా ఉంది.

తగిన చర్యలు తీసుకుంటున్నాం

మధ్యాహ్న భోజన నూతన మెనూను అమలు చేస్తాం. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు ఇస్తాం. మరోవైపు నిత్యావసర సరకులు, కూరగాయలను కాంట్రాక్టర్లు సరఫరా చేయాలని ఆదేశాలున్నాయి. అప్పటి వరకు నిర్వాహకులతో భోజనాన్ని అందిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో చర్యలు తీసుకుంటాం.

– ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి

అమరుల సంస్మరణ సభలను నిర్వహించండి

మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా గురువారం అమరుల సంస్మరణ సభలను ఘనంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 61గ్రామాలు, 13 పురపాలక సంఘాల్లో గురువారం ఉదయం 11గంటలకు సంస్మరణ సభలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరులకు శ్రద్ధాంజలి ఘటించి, మౌనం పాటించాలని కలెక్టర్ సూచించారు. అమరుల సంస్కరణ తీర్మానం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత ఫార్మాట్లో అమరుల సంస్మరణ తీర్మానాలు జాగ్రత్తగా చేయాలని అన్నారు. విద్యాలయాలు, ప్రార్థనా సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించి వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలన్నారు. మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

డిప్యూటీ డీఈఎంఓ వేణుగోపాల్‌రెడ్డి మృతి తీరనిలోటు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్



వేణుగోపాల్‌రెడ్డి(ఫైల్)

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎక్స్టెన్షన్ అండ్ మీడియా అధికారి(డీఈఎంఓ) వేణుగోపాల్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్రంగా కలిచివేసిందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆయన లేనిలోటు ఎన్నటికీ తీర్చలేనిదని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేశారు. వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఈస్ట్ కోస్ట్ రోడ్ నుంచి పాండిచ్చేరి మార్గంలో కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందన్నారు. ఆయన మృతి చెందగా భార్య, ఇద్దరు కుమారులు చికిత్స పొందుతున్నారన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఈఎంఓ వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి బుధవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.



రాష్ట్రంలో ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ



కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సేవలో మంత్రి మల్లారెడ్డి

కీసర: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామి సేవలో మంత్రి మాల్లారెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. యాదాద్రి దేవాలయాన్ని పునర్నిర్మించి తెలంగాణ గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప సీఎం కేసీఆర్ అన్నారు. అనంతరం కీసరలో పెంతెకోస్తు చర్చి, కీసరలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈద్గాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ఎంతో కృషి చేస్తోందని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, మున్సిపల్ చైర్మన్లు వసుపతి ప్రణితాగౌడ్, కౌకుట్ల చంద్రారెడ్డి, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేష్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లి హనుమాన్ ఆలయంలో పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో గట్టుమైసమ్మ ఆలయంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

'మా పట్టాభూమిలోకి వెళ్లనీయడం లేదు'



పట్టాభూమిలో నిరసన చేపట్టిన భూబాధితులు

ఘట్‌కేసర్: మా పట్టా భూమిలోకి మమ్మల్ని రానీయకుండా కొర్రెముల్ జేకే ఫంక్షన్ హాలు యజమాని బెదిరిస్తున్నాడని, రాత్రి సమయంలో పని చేయిస్తూ మా భూమిని కబ్జా చేశాడని సర్వే నంబర్ 332–335, 337–340లోని భూయజమానులు ఆంజనేయులు, హరికృష్ణ తదితరులు ఆరోపించారు. కొర్రెముల్‌లోని జేకే ఫంక్షన్ హాలు వద్ద తమ పట్టా భూమిలో బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫంక్షన్ హాలు యజమానికి సర్వేనంబర్ 335లో 1.05 ఎకరాల భూమి ఉంటే మొత్తం భూమిలో హాలు నిర్మించాడన్నారు. ధరణి రికార్డు ప్రకారం సర్వే చేయాలని పలుమార్లు ఏడీ సర్వేకు పెట్టుకున్నా వాళ్లు రావడం లేదని, పీఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం [illegible] [illegible] [illegible] [illegible] లేక ఇబ్బందులు పడుతున్నామని, మాకు వారితో ప్రాణభయం ఉందని, పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

10 వేల మంది ప్రాణాలతో చెలగాటమా..?

మూడుచింతలపల్లి మండల సమావేశంలో సభ్యులు



మిషన్ భగీరథ లైన్ మరమ్మతులపై అధికారులను ప్రశ్నిస్తున్న వైస్‌ఎంపీపీ, కొల్తూర్ సర్పంచ్ శిల్ప

శామీర్‌పేట్: పదివేల మంది ప్రాణాలతో మిషన్ భగీరథ అధికారులు చెలగాటం ఆడుతున్నారని వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ శిల్ప ప్రశ్నించారు. బుధవారం మూడుచింతలపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ హారికామురళీగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొల్తూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ దెబ్బతినడంతో కలుషిత నీళ్లు ఇళ్లలోకి సరఫరా అవుతున్నాయని, మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇచ్చి 20 రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని వారు అసహనం వ్యక్తం చేశారు. సభ్యులు పలు సమస్యలను సభాదృష్టికి తీసుకువచ్చారు. మండల స్థాయి అధికారులు సమావేశానికి గైర్హాజరైతే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని సభ్యులు ప్రశ్నించారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మెన్ మధుకర్‌రెడ్డి, ఎంపీడీఓ వత్సలదేవి, తహసీల్దార్ వాణిరెడ్డి, ఎంఈఓ వసంతకుమారి, ఏఓ కృష్ణవేణి, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ అభివృద్ధే లక్ష్యంగా..



పనులను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 12వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సతీష్‌కుమార్, 21వ డివిజన్ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. జవహర్‌నగర్‌లోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సింగన్న బాలరాజు, సిద్ధులు యాదవ్, భాస్కర్, బాల్‌నర్సింహయాదవ్, కృష్ణ, రమేష్, విష్ణు, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్‌కు నివాళి



మండల పరిషత్‌లో..

మేడ్చల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, వివిధ ప్రాంతాల్లో, మండల పరిషత్‌లో, గౌడవెల్లి గ్రామంలో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు మండల పరిషత్‌లో సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవద్దు'

కాంగ్రెస్ ఎస్సీ సెల్ తీర్మానం



తీర్మాన పత్రాలను ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకులు

మేడ్చల్: నియోజకవర్గ బీ బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసినా పట్టించుకోని నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్లు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్‌ల కార్యక్రమాల్లో పాల్గొనవద్దని నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీసెల్ తీర్మానం చేసింది. నగరంలో నిర్వహించిన ఎస్సీసెల్ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ 15 రోజుల క్రితం నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్లు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్ ఘట్‌కేసర్ మండలంలో పాదయాత్ర చేయగా ఆ కార్యక్రమంలో నాయకుడు మహేష్‌గౌడ్ నియోజకవర్గ బీ బ్లాక్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కుర్రి మహేష్‌పై దాడి చేసినా ఇద్దరు కో ఆర్డినేటర్లు పట్టించుకోలేదని వాపోయారు. తమను కించపరిచి దాడులు చేసినా కో ఆర్డినేటర్లు కనీసం మందలించకపోవడం శోచనీయమని వాపోయారు. ఈనెల 23న నిర్వహించే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రోగ్రాం మినహా కో ఆర్డినేటర్లు నిర్వహించే కార్యక్రమాలకు ఎస్సీ సెల్ నాయకులు హాజరు కావొద్దని బుధవారం నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. ఈ విషయాన్ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, ఏ, బీ బ్లాక్ అధ్యక్షుడు పానుగంటి మహేష్, కుర్రి మహేష్, మహిళా కన్వీనర్ సునీత, నాయకులు శ్రీనివాస్, మల్లేష్, వెంకటేష్, హరిగోపాల్, లక్ష్మణ్, ఎన్.శ్రీనివాస్, వంగరాజు, నవీన్, 5 మండలాల 7 మున్సిపాలిటీల ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగం



జిల్లా పరిషత్ ఆవరణలో యోగా చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జవహర్‌నగర్‌లో యోగాసనాలు వేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

మేడ్చల్ జోన్ బృందం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మేడ్చల్ జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పలువురు యోగాసనాలు వేశారు. నిత్యం యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని పలువురు యోగా గురువులు సూచించారు. నిత్యం యోగా చేయడం అలవాటు చేసుకోవాలని, బిజీ జీవితంతో పాటు మారుతున్న జీవన శైలి కారణంగా త్వరగా రోగాలు చుట్టుముడుతున్నాయని, నిత్యం యోగా చేస్తే పెద్ద రోగాల నుంచి సైతం తప్పించుకోవచ్చని అన్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఆరోగ్యకరమైన జీవనానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.



అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో..



ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో..



గుండ్లపోచంపల్లి సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో..



కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ కళాశాలలో..



నాగారంలో యోగ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



చౌదరిగూడ రోటర్ డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్లో..